# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 01-09-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలు పాటించడం సరికాదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎస్సీఓ సభ్య దేశాలకు స్పష్టం చేశారు.
- భారత్, రష్యా దేశాల మధ్య సహకారం ప్రపంచ శాంతికి ఆవశ్యకమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- డిజిటలైజేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లను పాఠ్యాంశాల్లో చేర్చాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఉద్ఘాటించారు.
- భారత్ పొరుగు దేశమైన ఆఫ్ఘనిస్తాన్‌లో నిన్న అర్థరాత్రి సంభవించిన భూకంపంలో ఇప్పటి వరకు 800 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలు ఆమోదయోగ్యం కాదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. చైనాలోని టియాన్జిన్ లో ఈరోజు జరిగిన షాంఘై సహకార సంస్థ (SCO) శిఖరాగ్ర సమావేశంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ... ఉగ్రవాదాన్ని మానవాళికి ఒక పెద్ద సవాలుగా అభివర్ణించారు. భారతదేశం గత నాలుగు దశాబ్దాలుగా ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటోందని, అన్ని రకాల ఉగ్రవాదాన్ని ఖండించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. SCO సభ్య దేశంగా భారత్ సానుకూల పాత్ర పోషించిందన్నారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత భారతదేశానికి సంఘీభావం తెలిపిన దేశాలకు ఈ సమావేశం వేదికగా ప్రధానమంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

(వాయిస్ 39 సెకన్లు)

SCO శిఖరాగ్ర సమావేశంలో నరేంద్ర మోదీ .. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లతో తన దృక్పథాలను పంచుకున్నారు. అనంతరం ప్రధానమంత్రి చైనా పర్యటన ముగించుకొని భారత్‌కు తిరుగు పయనమయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ రష్యా దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ తో ప్రతినిధి స్థాయి చర్చలు జరిపారు. షాంఘై సహకార సంస్థ (SCO) శిఖరాగ్ర సమావేశం సందర్భంగా చైనాలోని టియాంజిన్‌లో ఇరువురు సమావేశమై చర్చించారు. ఆర్థిక, ఇంధన రంగాలతో సహా వివిధ రంగాలకు సంబంధించి, ద్వైపాక్షిక సంబంధాలలో స్థిరమైన వృద్ధి పట్ల ఇరువురు సంతృప్తి వ్యక్తం చేశారు. ఉక్రెయిన్‌కు సంబంధించిన తాజా పరిణామాలతో సహా ప్రాంతీయ, ప్రపంచ సమస్యలపై కూడా చర్చించారు. ఉక్రెయిన్‌లో సంఘర్షణను పరిష్కరించడానికి ఇటీవల తీసుకున్న చర్యలకు ప్రధానమంత్రి తన మద్దతును పునరుద్ఘాటించారు. భారత్, రష్యా దేశాలు ఎల్లప్పుడూ అత్యంత క్లిష్ట సమయాల్లో కూడా కలిసి నిలబడతాయని ప్రధానమంత్రి అన్నారు. ప్రపంచ శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం రెండు దేశాల మధ్య సన్నిహిత సహకారం ఆవశ్యకమని నరేంద్ర మోదీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని షాంఘై సహకార సంస్థ (SCO) ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. ఈ శిఖరాగ్ర సమావేశం అనంతరం ఒక ప్రకటనను విడుదల చేస్తూ.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా స్పష్టమైన, ఏకీకృత సందేశాన్ని పంపింది. అలాగే.. ప్రాంతీయ సహకారం, ఆవిష్కరణలకు భారతదేశం అందిస్తున్న సహకారాన్ని ప్రస్తావించింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సమిష్టి ప్రయత్నాలను బలోపేతం చేయడంలో టియాన్జిన్ డిక్లరేషన్ ఒక కీలక అడుగును సూచిస్తుంది. అలాగే ఈ సంవత్సరం ఏప్రిల్ నెలలో న్యూఢిల్లీలో 5వ SCO స్టార్టప్ ఫోరమ్ విజయవంతంగా నిర్వహించడాన్ని డిక్లరేషన్ స్వాగతిస్తూ.. భారతదేశానికి కృతజ్ఞతలు తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఆఫ్ఘనిస్తాన్‌లోని జలాలాబాద్ నగరానికి సమీపంలోని కునార్ ప్రావిన్స్‌లో నిన్న అర్ధరాత్రి సంభవించిన భూకంపంలో ఇప్పటి వరకు 800 మందికి పైగా మరణించగా, మరో 2,500 మంది గాయపడ్డారు. ఈ భూకంప కేంద్రం జలాలాబాద్ కు తూర్పు-ఈశాన్య దిశగా 27 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లుగా గుర్తించారు. ఈ ఘటన పట్ల భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. భూకంపం ధాటికి తీవ్రంగా నష్టపోయిన ఆఫ్ఘనిస్థాన్‌కు అవసరమైన సహాయం అందించి, ఆ దేశాన్ని ఆదుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని ప్రధానమంత్రి ప్రకటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

పంజాబ్ లో గత నెల రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో సంబవించిన వరదల కారణంగా ఇప్పటివరకు 29 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ వరదల వల్ల ప్రభావితమైన 12 జిల్లాల్లోనూ ప్రాణనష్టం జరిగిందని అధికారులు తెలిపారు. వరదల కారణంగా 2 లక్షల 46 వేల మంది పైగా ప్రభావితమయ్యారని, 15,600 మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని పేర్కొన్నారు. ఆ రాష్ట్రంలో 94 వేల హెక్టార్ల మేర పంట నష్టం వాటిల్లిందని చెప్పారు. హిమాచల్ ప్రదేశ్, పంజాబ్‌లో కురుస్తున్న వర్షాలతో రావి, బియాస్, సట్లెజ్ నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఎల్లుండి వరకు అన్ని విద్యా సంస్థలను మూసివేస్తున్నట్టు అధికారులు తెలియజేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

డిజిటలైజేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లను పాఠ్యాంశాల్లో చేర్చడం ఆవశ్యకమని కేంద్ర విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఉద్ఘాటించారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (NCERT) 65వ వ్యవస్థాపక దినోత్సవాల్లో కేంద్రమంత్రి పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా విద్య నాణ్యతను, పాఠ్యాంశాల అభివృద్ధిని పెంపొందించడంలో భాగంగా వివిధ కార్యక్రమాలతో పాటు PM eVidya మొబైల్ యాప్‌ను, DIKSHA 2.0ను కేంద్రమంత్రి

ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశ విద్యా రంగం పురోగతిలో NCERT పాత్రను ప్రశంసించారు.

(వాయిస్ 40 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారధ్యంలోని ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 7.8 శాతం జిడిపి వృద్ధిని నమోదు చేయడంతో దేశ పురోగతి ప్రపంచానికి మరో సారి రుజువైందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యానించారు. న్యూఢిల్లీలో ఈరోజు ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రధానమంత్రి భారత ఆర్థిక వ్యవస్థను ఉత్తమ మార్గంలో నడుపుతున్నారని ప్రపంచంలోని అగ్రశ్రేణి ఆర్థికవేత్తలు కొనియాడుతున్నారని చెప్పారు. స్వావలంబన దిశగా మేక్ ఇన్ ఇండియాను ప్రోత్సహించాలని, స్వదేశీ భావనను స్వీకరించాలని కిరణ్ రిజిజు ఈ సందర్భంగా దేశ ప్రజలకు సూచించారు.

(వాయిస్ 38 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఆగస్టు నెలకు సంబంధించి వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్ళు  లక్షా 86 వేల కోట్ల రూపాయలకు చేరుకున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. గత సంవత్సరం ఆగస్టు నెలతో పోలిస్తే వసూళ్ళలో 6.5 శాతం వృద్ధి నమోదయ్యిందని పేర్కొంది. స్థూల దేశీయ ఆదాయం దాదాపు లక్షా 37 వేల కోట్ల రూపాయలుగా నమోదైందని, స్థూల దిగుమతి ఆదాయం 49 వేల కోట్ల రూపాయలకు పైగా ఉందని వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న మూడు రోజుల్లో గోవా, మధ్యప్రదేశ్, మహరాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అధికారులు వెల్లడించారు. అలాగే ఈనెల 3వ తేదీ నుండి మూడు రోజుల పాటు.. ఈశాన్య ప్రాంతాల్లోను, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్లో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిసాయి. ఉదయం సెన్సెక్స్.. 79,809 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరకు 555 పాయింట్లు లాభపడి 80,364 వద్ద ముగిసింది. నిఫ్టీ 198 పాయింట్లు పెరిగి 24,625 వద్ద స్థిరపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 11 పైసలు క్షీణించి 88.20 పైసలుగా ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =